

## సిన్నర్ సెమీస్‌కు.. స్వియాటెక్ ఇంటికి..

న్యూయార్క్ :యూఎస్ ఓపెన్‌లో టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ ఆ దిశగా మరో అడుగు ముందుకు వేశాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఒకటో సీడ్ సిన్నర్ 6-2, 1-6, 6-1, 6-4తో డేనిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి యూఎస్ ఓపెన్ సెమీస్‌కు అర్హత సాధించాడు. ఈ పోరులో గెలవడం ద్వారా కొరడొ బరఝూట్టి (1977), బెరెట్టిని (2019) తర్వాత యూఎస్ ఓపెన్‌లో సెమీస్ చేరిన మూడో ఇటలీ ప్లేయర్‌గా నిలిచాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో జెస్సిక పెగులా 6-2, 6-4తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ స్వియాటెక్‌ను ఓడించి సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది.

## టీ20లలో 10 పరుగులకే ఆలౌట్

- మంగోలియా చెత్త రికార్డు

బంగి : బ్యాటర్లు పరుగుల వరద పారించే పొట్టి క్రికెట్‌లో మంగోలియా జట్టు అత్యంత చెత్త రికార్డు నమోదు చేసింది. 2026 పొట్టి ప్రపంచకప్ కోసం ఐసీసీ నిర్వహిస్తున్న ఆసియా క్వాలిఫయర్స్ టోర్నీలో భాగంగా సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో మంగోలియా 10 పరుగులకే ఆలౌట్ అయింది. సరిగ్గా 10 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఆ జట్టులో ఐదుగురు డకౌట్ అవగా మిగిలినవారిలో ఒక్కరు కూడా 2 పరుగులు చేయలేకపోయారు.

## బుచ్చిబాబు ఫైనల్లో హైదరాబాద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ ఫైనల్లోకి ప్రవేశించింది. తమిళనాడు ప్రెసిడెంట్స్ లెవన్‌తో జరిగిన సెమీస్‌లో హైదరాబాద్ 64 పరుగుల తేడాతో గెలిచింది. తనయ్ (5/62), అనికేత్‌రెడ్డి (4/59) ధాటికి టీఎన్‌సీఏ లెవన్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే కుప్పకూలింది.

# పారా పాతిక సంబురం

### 25 పతకాల లక్ష్యాన్ని పూర్తిచేసిన భారత్ • క్లబ్ త్రోలో స్వర్ణం, రజతం • జూడోలో కాంస్యం



ధరంబీర్



ప్రణవ్

పారిస్: పారాలింపిక్స్‌లో 25 పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్ ఈ క్రీడల ముగింపునకు మరో రెండ్రోజులు గడువు ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. పతకాల వేటలో ఆకలిమీదున్న పులుల్లా ఉన్న పారా అథ్లెట్లు భారత్ ఖాతాలో మరో మూడు మెడల్స్ చేర్చడంతో లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన క్లబ్ త్రోలో ధరంబీర్ సింగ్, సూర్మ ప్రణవ్ వరుసగా స్వర్ణ, రజతాలతో మెరిశారు. ఇక గురువారం జరిగిన పురుషుల 60 కిలోల జూడోలో యువ జూడోకా కపిల్ పర్మర్ మూడో స్థానంలో నిలవడంతో పారిస్‌లో 25 పతకాలతో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. క్లబ్ త్రోలో స్వర్ణం, రజతంతో పాటు జూడోలో కాంస్యం సాధించడం భారత పారాలింపిక్ చరిత్రలో ఇదే ప్రథమం.

### క్లబ్ త్రోలో స్వర్ణ, రజతాలు

పురుషుల క్లబ్ త్రో (ఎఫ్51) ఈవెంట్‌లో భారత్ తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ, రజతాలు కైవసం చేసుకుంది. భారత అథ్లెట్ ధరంబీర్ సింగ్.. 34.92 మీటర్ల త్రో తో స్వర్ణాన్ని దక్కించుకోగా మరో అథ్లెట్ సూర్మ ప్రణవ్ 34.59 మీటర్లతో రజతాన్ని గెలుచుకున్నాడు. తొలి నాలుగు త్రోలలో ఫౌల్ చేసిన ధరంబీర్ ఐదో ప్రయత్నంలో మాత్రం రికార్డు త్రో విసిరాడు. సెర్బియా అథ్లెట్ దిమిత్రిజెవిచ్ జెల్కొ (34.18) కాంస్యం గెలిచాడు.



కపిల్

### జూడోలో సరికొత్త చరిత్ర

యువ జూడోకా కపిల్ పర్మర్ భారత పారాలింపిక్స్ జూడో చరిత్రలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల 60 కిలోల కాంస్య పోరులో పర్మర్.. 10-0తో డి ఒలివిరా ఎలీల్టన్ (బ్రెజిల్)ను చిత్తుగా ఓడించి పతకం గెలిచాడు. తద్వారా ఈ క్రీడలో దేశానికి తొలి పకతం అందించిన ఆటగాడిగా చరిత్ర పుటల్లోకెక్కాడు. అంతకుముందు సెమీస్‌లో అతడు 0-10తేడాతో ఓడాడు.

### ఆర్చరీ.. తృటిలో

ఆర్చరీలో భారత్ తృటిలో పతకం కోల్పోయింది. మిక్స్‌డ్ టీమ్ రికర్వ్ ఓపెన్ సెమీస్‌లో ఇటలీ 6-2తో చేతిలో ఓడిన భారత్ కాంస్య పోరులోనూ నిరాశపరిచింది. స్లోవేనియా 5-4తో చేతిలో భారత్‌కు భంగపాటు ఎదురైంది. హర్విందర్ సింగ్-పూజా ద్వయం తొలి సెట్‌లో ఓడినా తర్వాత పుంచుకున్నారు. రెండు దేశాల ఆర్చర్ల మధ్య పోటీ హోరాహోరీగా జరుగడంతో మ్యాచ్ షూటాఫ్‌కు దారితీసింది. షూటాఫ్‌లో భారత్ 17 పాయింట్లే స్కోరు చేయగా స్లోవేనియా 19 పాయింట్లతో మ్యాచ్‌ను తమవైపునకు తిప్పుకుంది. మహిళల 100 మీటర్ల టీ12 రేసు ఫైనల్‌లో మన అమ్మాయి సిమ్రన్ శర్మ నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకుంది.

## చెప్పారు.. చేసి చూపించారు

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

'గత మూడేండ్లుగా మన క్రీడాకారుల సన్నద్ధత, కఠోర శ్రమను బట్టి చూస్తే ఈసారి మేం 25 కంటే ఎక్కువ పతకాలు నెగ్గుతామని నేను కచ్చితంగా చెప్పగలను. వారంతా ప్రణాళికబద్ధంగా శిక్షణ పొందారు. అందుకు సంబంధించిన ఫలితాలను మీరు త్వరలోనే చూస్తారు..' అంటూ పారిస్‌కు వెళ్లబోయే ముందు పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) దేవేంద్ర ఝఝారియా చెప్పిన మాటలివి. ఆయన మాటలను మన పారా బృందం చేతల్లో చేసి చూపించింది. ఒలింపిక్స్‌తో సమానంగా నిలిచే ఈ క్రీడలు మొదలైన రెండో రోజే యువ పారా షూటర్ అవని లేఖరా మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం గెలిచి దేశానికి పతకాల బోణీ కొట్టగా అదే రోజు మోనా అగర్వాల్ కాంస్యంతో మెరిసి భారత్‌కు డబుల్ ధమాకా అందించింది. షూటింగ్‌లో వీరితో మరో ఇద్దరు పతకాలు తీసుకురాగా తర్వాత ఆ బాధ్యతను షట్లర్లు తీసుకున్నారు. పలు విభాగాల్లో మన షట్లర్లు ఒక స్వర్ణం, రెండేసి రజతాలు, కాంస్యాలు సాధించి అథ్లెట్లలో జోష్‌ను నింపారు. ఇక ఎప్పటిలాగే పారా అథ్లెట్లు పాల్గొన్న ప్రతి క్రీడాంశంలోనూ సత్తా చాటారు. మహిళల వంద మీటర్ల రేసులో యువ రన్నర్ ప్రీతి పాల్ కాంస్యం నెగ్గడంతో అథ్లెటిక్స్‌లో బోణీ కొట్టిన భారత్ ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్ పుట్, హైజంప్‌లో పతకాల పంట పండించిన మన అథ్లెట్లు టోక్యో పారాలింపిక్స్ పతకాల సంఖ్య (19)ను అధిగమించి ఝఝారియా చెప్పిన లక్ష్యం వైపు వేగంగా కదిలారు. తెలంగాణ అమ్మాయి దీప్తి జీవాంజి మహిళల 400 మీటర్ల రేసులో కాంస్యం నెగ్గగా, రెండు చేతులూ లేకున్నా ఆర్చరీలో పతకం గెలిచిన శీతల్ దేవీ స్ఫూర్తిదాయక పోరాటానికి తోడు గత రెండు పారాలింపిక్స్‌లలో పతకాలు నెగ్గిన తంగవేలు మరియప్పన్ పారిస్‌లోనూ పతకం కొల్లగొట్టి చరిత్ర సృష్టించాడు. అథ్లెటిక్స్‌లో గురువారం నాటికే దేశానికి 13 పతకాలు (2 స్వర్ణాలు, 6 రజతాలు, 5 కాంస్యా లు) దక్కించుకుని అంచనాలకు మించి రాణించారు. ఇక గురువారం పారా జూడోలో కపిల్ పర్మర్ కాంస్యం గెలిచి ఈ క్రీడలో తొలి పతకం గెలిచిన భారతీయుడిగా నిలిచాడు. మరో రెండ్రోజులు సాగనున్న ఈ క్రీడలలో భాగంగా పలు క్రీడాంశాలలో బరిలో ఉన్న భారత్ 30 పతకాలను సాధించే దిశగా సాగుతోంది.




### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 69 | 54 | 37 | 160 |
| 2 | బ్రిటన్ | 34 | 28 | 19 | 81 |
| 3 | అమెరికా | 26 | 32 | 15 | 73 |
| 4 | నెదర్లాండ్స్ | 20 | 9 | 5 | 34 |
| 5 | ఫ్రాన్స్ | 17 | 22 | 21 | 60 |
| 6 | ఇటలీ | 16 | 10 | 27 | 53 |
| 15 | భారత్ | 5 | 9 | 11 | 25 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం



పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన తెలంగాణ యువ అథ్లెట్ జీవాంజి దీప్తిని గురువారం ఢిల్లీలో అభినందిస్తున్న కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవీయా

## దీప్తి తొలి కోచ్ వెంకటేశ్వర్లు మృతి



పర్వతగిరి, సెప్టెంబర్ 5 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్‌డీఎఫ్) పాఠశాల పీఈటీ, పారాలింపిక్స్ కాంస్య విజేత జీవాంజి దీప్తి తొలి కోచ్ బీ వెంకటేశ్వర్లు(54) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. గత 18 ఏళ్లుగా ఆర్‌డీఎఫ్ పాఠశాలలో పీఈటీగా పనిచేసి, అనేక మంది క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించిన వెంకటేశ్వర్లు ఐదారేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం పారాలింపిక్స్‌కు దీప్తి సన్నద్ధమవుతున్న సమయంలో ఆమెతో మాట్లాడి పతకం సాధించాలని ప్రోత్సహించారు. మృతుడికి భార్య రమ, కుమార్తె ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలోని ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆర్‌డీఎఫ్ ప్రధానోపాధ్యాయుడు అశోకాచారి తెలిపారు.


## ముషీర్ ఖాన్ సెంచరీ

### ఇండియా 'బీ'ను ఆదుకున్న ముంబై బ్యాటర్ • అక్షర్ పటేల్ అండతో గట్టెక్కిన ఇండియా 'డీ'



ముషీర్ ఖాన్ (105*)

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో అంతర్జాతీయ స్టార్లు తేలిపోయారు. ముంబై బ్యాటర్, సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడైన ముషీర్ ఖాన్ (105 నాటౌట్) సెంచరీ చేయడంతో మొదట బ్యాటింగ్ చేసిన అభిమన్యు ఈశ్వరన్ సారథ్యంలోని ఇండియా 'బీ' తొలి రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (30) ఫర్వాలేదనిపించగా సుమారు రెండేండ్ల విరామం తర్వాత టెస్టులు ఆడిన రిషభ్ పంత్ (9) సైతం విఫలమయ్యాడు. తెలుగు క్రికెటర్ నితీశ్‌రెడ్డి డకౌట్ అయ్యాడు. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని ఇండియా 'ఏ' బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ఆకాశ్ దీప్, అవేశ్ ఖాన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక అనంతపురం వేదికగా ఇండియా 'సీ'తో తలపడుతున్న ఇండియా 'డీ' బ్యాటింగ్‌లో దారుణంగా విఫలమైంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఆ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.3 ఓవర్లలో 164 పరుగులకే ఆలౌట్ అయింది. అక్షర్ పటేల్ (86) ఆదుకోకుంటే ఆ జట్టు వంద పరుగులు కూడా చేయకపోయి ఉండేది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఇండియా సీ కూడా తడబడింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 33 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 91 రన్స్ చేసింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.